నర్సరీల ఊరు

- అర్జునిపాలెంలో 8 నర్సరీల నిర్వహణ
- ఏడాదిలో ఏడు లక్షల మొక్కలు పెంపకం


నర్సరీలోని శ్రీగంధం మొక్కలు

పద్మనాభం : అదో చిన్న ఊరు... ఆ ఊరిలో మాత్రం ఏటా లక్షలాది రూపాయల వ్యాపారం సాగుతుంది... ఆ ఊరు పేరు చెప్పగానే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని చాలా మందికి ఠక్కున గుర్తొచ్చేస్తుంది... ఆ ఊరే నర్సరీల ఊరుగా ప్రాచుర్యం పొందిన అర్చకునిపాలెం. పద్మనాభం పంచాయతీలో భాగమైన ఈ ఊరిలో చాలా మంది నర్సరీలతో ఉపాధి పొందుతూ చాలా మందికి పని కల్పిస్తున్నారు. విజయనగరం – సింహాచలం ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన ఉన్న అర్చకునిపాలెంలో ప్రస్తుతం 8 నర్సరీలు ఉన్నాయి. 1992లో ఇక్కడ ఒకే ఒక ప్రభుత్వ నర్సరీ ఉండేది. అనంతరం 1995 నుంచి గ్రామస్తులు సొంతంగా నర్సరీలు ప్రారంభించి, ఉపాధి పొందడం ప్రారంభించారు. అలా పెరుగుతూ 2017 నాటికి 12 నర్సరీలు ఉండేవి. తర్వాత కాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రస్తుతం 8 నర్సరీలు వున్నాయి. ఇక్కడ క్రోన్ నీలగిరి, టేకు, మల్బరీ వేప, ఎర్ర చందనం, శ్రీగంధం, ఇతర మొక్కలు పెంచి, విక్రయిస్తున్నారు. ఏడాదికి సుమారు ఏడు లక్షల మొక్కలు పెంచి విక్రయిస్తుంటామని నిర్వాహకులు చెబుతున్నారు.

స్థానిక కూలీలకు ఉపాధి

జనవరి నెల నుంచి నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియను నిర్వాహకులు ప్రారంభిస్తారు. జూన్ నెల నాటికి సిద్ధమవుతాయి. నారు వేయడానికి ముందుగా పాలిథీన్ సంచుల్లో మట్టి నింపడానికి కూలీలకు పని కల్పిస్తారు. మొక్కలు పెరిగేంత వరకు కలుపు తీయడం, ఇతరత్రా పనులకు జనవరి నుంచి జూన్ వరకు స్థానిక కూలీలకు చేతి నిండా పని దొరుకుతుంది. ఆరు నెలల్లో రోజూ అర్చకునిపాలెం, పద్మనాభం గ్రామాలకు చెందిన సుమారు 60 మంది కూలీలకు పని దొరుకుతుంది. నర్సరీల వల్ల అటు నిర్వాహకులకు లాభాలు, ఇటు కూలీలకు ఉపాధి లభిస్తుంది.


నర్సరీలోని నీలగిరి మొక్కలు

వర్షాలతో జోరుగా అమ్మకాలు

మొక్కలను కొనుగోలు చేయడానికి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని చాలా ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడకు వస్తుంటారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాం, పొందూరు, ఉమ్మడి విజయనగరం జిల్లా డెంకాడ, గరివిడి, బొబ్బిలి, జొన్నాడ, పాచిపెంట, ఉమ్మడి విశాఖ జిల్లా చోడవరం, కాపులుప్పాడ ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చి మొక్కలు కొనుగోలు చేసుకుని తీసుకెళ్తారు. వర్షాలు సకాలంలో కురిస్తే మొక్కలు విరివిగా అమ్ముడవుతాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు కురవడంతో మొక్కలు జోరుగా అమ్ముడవుతున్నాయని... క్రోన్ నీలగిరి మొక్కలను ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారని నర్సరీల నిర్వాహకులు చెబుతున్నారు.


నర్సరీలోని ఎర్ర చందనం మొక్కలు

వర్షాలు కురిస్తేనే ఫలితం



ఈ ఏడాది సుమారు 50 వేల వరకు మొక్కలు నర్సరీలో పెంచాను. వర్షాలు కురిస్తేనే తమ కష్టానికి ఫలితం దక్కుతుంది. జూన్ నెల నుంచి బాగా వర్షాలు కురిస్తే మొక్కల కొనుగోలుకు రైతులు వస్తారు. ప్రస్తుతం జోరుగా వర్షాలు కురవడంతో క్రోన్ నీలగిరి మొక్కలు అమ్ముడవుతున్నాయి. జులై నెల మొదటి వారానికి సగం మొక్కలు అమ్ముడైతే... అక్టోబర్ నెలాఖరులోగా మొక్కలు పూర్తిగా అమ్ముడైపోతాయి.

– తాలాడ నర్సింగరావు, నర్సరీ నిర్వాహకుడు

27 ఏళ్ల నుంచి నర్సరీలు



27 ఏళ్ల నుంచి నర్సరీలు నిర్వహిస్తున్నాను. 1997 నుంచి నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నా. వర్షాలు ముఖం చాటేయడంతో 2016లో లక్ష వరకు నీలగిరి మొక్కలు అమ్ముడుకాకుండా నర్సరీల్లోనే ఉండిపోయాయి. 2017లో 30 వేలు నీలగిరి మొక్కలు ఉండిపోయాయి. దీంతో రూ.1.50 లక్షలు నష్టపోయాను. మిగతా సంవత్సరాల్లో కూలీలకు కూలి చెల్లించగా తమ కష్టానికి ఫలితం దక్కింది. ఈ ఏడాది క్రోన్ నీలగిరి మొక్కలు మాత్రమే అమ్ముడువుతున్నాయి. మిగతా రకాల మొక్కలు ఇంకా అమ్ముడు కాలేదు.

– తాలాడ ఆదినారాయణ, నర్సరీ నిర్వాహకుడు

క్లుప్తంగా

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు నేటితో గడుపు పూర్తి

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచార సభ సెప్టెంబర్ 14, 15న నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలకు ఫీజు చెల్లింపునకు బుధవారంతో గడువు ముగియనున్నట్టు ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. రూ.10 అపరాధ రుసుముతో ఆగస్టు 5 వరకు అవకాశం ఉందన్నారు. మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

పైడితల్లమ్మ ఆలయ హుండీ చోరీ

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పైడితల్లమ్మ ఆలయ హుండీని సోమవారం రాత్రి దొంగలు తెరిచి అందులోని కానుకలు అపహరించారు. ఐదు మాసాలుగా తెరవని హుండీలో కనీసం రూ.5 వేలు ఉంటాయని ఆలయ ట్రస్టీ వంక ఎర్రయ్య తెలిపారు. ఈ దొంగతనంపై ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా వచ్చి ఆలయ పరిసరాలను గాలించారు. అక్కడ గునపం లభించడంతో దాంతోనే హుండీ తెరిచినట్టు గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కులపై మహిళలకు అవగాహన అవసరం


సంతపేట కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు

తగరపువలస : మహిళల హక్కులపై జీవీఎంసీ రెండో వార్డు సంతపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కల్పించారు. జోన్ సెక్టార్ సూపర్‌వైజర్ కె.ప్రమీలారాణి, ప్రధానోపాధ్యాయురాలు బి.బ్రాహ్మణి, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి పాల్గొని మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, గృహ హింస, మహిళా చట్టాలపై వివరించారు. తరచూ మహిళలు తమ రక్షణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హక్కులపై అవగాహన కలిగి వుండాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా జట్లమ్మ ఉత్సవం


జట్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వర్తకులు

పద్మనాభం : మండలంలోని రేవిడిలో వర్తకులు మంగళవారం జట్లమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జట్లమ్మ తల్లి వర్తక సంఘం అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేష్, కార్యదర్శి ఎం.సురేష్, సంయుక్త కార్యదర్శి పి.నాగరాజు, కోశాధికారి సీహెచ్.చిన్న, స్థానిక నాయకులు మరగడ అప్పారావు, పాండ్రంగి అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అనాథ బాలలకు సరకులు అందజేత

తగరపువలస : భీమిలి మండలం లక్ష్మీపురంలోని స్వచ్ఛంద సంస్థకు చెందిన కరుభుక్త సంజీవరావు ఆధ్వర్యంలో మంగళవారం పలువురు అనాథ బాలలకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించారు. బంగ్లామెట్ట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు గాడు వెంకటప్పడు, గాడు వెంకట నారాయణ, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, కరుభుక్త అప్పలరాజు, కనకల వెంకటరమణ, మొకర పైడినాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ


గుర్రాల శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన గుర్రాల శ్రీనివాస్ ఇటీవల అస్వస్థతకు గురవడంతో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు మంగళవారం సాయంత్రం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి గ్రామ పెద్ద చిల్ల సూర్యనారాయణరెడ్డి రూ.5 వేలు, వార్డు పార్టీ ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి రెండు ప్యాకెట్ల బియ్యం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, గేదెల సన్యాసి రెడ్డి, చేట్ల నరసింగ రెడ్డి, పీతల రాజారావు, వాసుపల్లి నరేంద్ర, బవిరిశెట్టి సింహాద్రి, నగిరెడ్ల రాంబాబు, కంబపు దుర్గా రెడ్డి, మొక్క సూర్యనారాయణ, కోల అప్పారావు, ఊళ్ల రాజు, కోనాడ రాజు, కొల్లి సత్యం, కోనాడ కనకరావు పాల్గొన్నారు.

కృష్ణాపురం కాలువలోకి సాగునీరు విడుదల


కృష్ణాపురం సాగునీటి కాలువలోకి నీరు విడుదల చేస్తున్న రైతులు

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం సాగు నీటి కాలువలోకి మంగళవారం సాగునీరు విడుదల చేశారు. పొట్నూరు గోస్తనీ నది వద్ద ఉన్న గేటును నాయకులు, రైతులు ఎత్తి కాలువలోకి నీరు విడుదల చేశారు. ఈ కాలువ కింద సుమారు 1600 ఎకరాల భూమి సాగు చేస్తున్నారు. కార్యక్రమంలో మొకర అప్పలనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపీపీ డి.గోపాలకృష్ణమూర్తి రాజు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బబ్బేలమ్మ సారె ఊరేగింపు


కూరగాయల అలంకరణలో బబ్బేలమ్మ అమ్మవారు


అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న మహిళలు

పీఎం పాలెం : భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నిత్య పూజలు అందుకుంటున్న కారుషెడ్ కూడలిలోని బబ్బేలమ్మ సారె ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని బబ్బేమల్మ అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన కూరగాయలతో అలంకరించారు. అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. సాయంత్రం మంగళవాయిద్యాల మధ్య పిలకవానిపాలెం మహిళలు 64 రకాల పిండివంటలతో సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, సూర్యారావు, బాలాజీ, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు


మొక్కలతో సాయి రవీంద్ర పాఠశాల విద్యార్థులు

తగరపువలస : నటుడు సోనూసూద్ పుట్టిన రోజు సందర్భంగా జీవీఎంసీ ఒకటో వార్డు రామన్నపేట సాయి రవీంద్ర పాఠశాల విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటారు. సూద్ ఛారిటీ ఫౌండేషన్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో స్కూల్ కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ ఆధ్వర్యంలో పాఠశాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పాలనా సామర్థ్యం పెంపు



శిక్షణ పొందుతున్న వారితో ఎన్‌సీజీజీ డైరెక్టర్ శ్రీనివాస్

తగరపువలస : పాలనా సామర్థ్యం పెంపొందించడానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఎన్‌సీజీజీ డైరెక్టర్ జనరల్ వి.శ్రీనివాస్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో జరుగుతున్న డిజిటల్ గవర్నెన్స్ శిక్షణలో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్‌సీజీజీ, ఐఐఎంవీ మధ్య సహకారం గురించి వివరించారు. ఆగస్టు 2 వరకు నిర్వహించే శిక్షణ తరగతులు సమాచార, సాంకేతిక, డిజిటల్ రంగాల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రభుత్వ అధికారుల నైపుణ్యాలు మెరుగుపరచడానికి దోహదం చేస్తాయన్నారు. 11 రాష్ట్రాల నుంచి 19 మంది సీనియర్ అధికారులు శిక్షణలో పాల్గొన్నారన్నారు. ఇ గవర్నెన్స్ ప్రాజెక్టులను అమలు చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, వ్యూహాలతో అధికారులను సన్నద్ధం చేయడమే ఈ శిక్షణ ఉద్దేశ్యమన్నారు. ఎన్‌సీజీజీ కోర్సు డైరెక్టర్ బిష్ట్, ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం : భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న జేజే పవర్ జిమ్ విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపారు. రెండు రోజుల క్రితం విశాఖలో జరిగిన పోటీల్లో కె.వెంకటేష్ ప్రథమ స్థానంలో, ఎ.కోమల్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచారు. జిమ్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన కోచ్ ఎన్.శ్రీనివాసరావు వీరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిద్దరూ పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. వీరు సెప్టెంబర్‌లో విశాఖలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గురుకులాన్ని సందర్శించిన యూఎస్ గైడ్


యూఎస్ గైడ్ టీచర్ మార్లిన్ లైమ్ లారెన్స్‌ని సత్కరిస్తున్న గురుకుల డీసీవో రూపావతి

మధురవాడ : కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈని యూఎస్ గైడ్ టీచర్ మార్లిన్ లైమ్ లారెన్స్ మంగళవారం సందర్శించారు. రోడ ఇవాంజలిన్ కెనడీ లూజర్ యూత్ ఎక్స్చేంజి ప్రోగ్రాం (కేఎల్‌వైఈఎస్)లో భాగంగా ఇద్దరు విద్యార్థులు యూఎస్‌ఏ వెళ్లి అక్కడ ఒక సంవత్సరంపాటు అగ్రికల్చర్ డిప్లమా కోర్స్ పూర్తి చేసుకుని గత జూన్ నెలలో స్వదేశానికి తిరిగి వచ్చారు. వారిని కలవడం కోసం, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను చూడాలని ఖండాలను దాటి మార్లిన్ ఇండియా వచ్చారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సంస్కృతి సంప్రదాయలు, చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీవో రూపావతి, యూఎస్‌ఏ వెళ్లి వచ్చిన కృష్ణాపురం, ఈద్పుగళ్లు గురుకులాల విద్యార్థులు కృష్ణతేజ, ఆకాంక్ష, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ


పసుపు, కుంకుమ ప్యాకెట్లు, పువ్వులతో అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను ఆలయ కమిటీ ప్రతినిధులు పసుపు, కుంకుమ ప్యాకెట్లు, పువ్వులతో మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరణకు గ్రామానికి చెందిన టి.రాసమ్మ, కె.ప్రసన్న, పి.సాయి, పి.శ్యామల, కె.సంధ్య, బి.మధు, పి.జగదీశ్వరి, టి.దీపు, జి.ప్రవళిక, దేవి, టి.నితీష్, కె.రోహిణి సహాయ సహకారాలు అందించారు. తుపాకుల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారికి భారీగా సారె సమర్పించనున్నారు.

నేను రాను... భోజనాలు పెట్టి పంపించేయండి

- టీడీపీ నాయకులకు గంటా ఝలక్
- పెద్దిపాలెంలో విజయోత్సవ కార్యక్రమం ఫ్లాప్

తగరపువలస : టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనదైన శైలిలో ఝలక్ ఇచ్చారు. భీమిలి మండల టీడీపీ విజయోత్సవ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ఆనందపురం మండలం పెద్దిపాలెం చెన్నా కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రానున్నారని మూడు రోజుల నుంచి జరుగుతున్న ఈ సన్నాహక కార్యక్రమానికి నాయకులు పెద్ద ఎత్తున కసరత్తు చేశారు. వెయ్యి మందికి భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. తీరా సమయం ఆసన్నమైన తర్వాత వారి ఆశలపై గంటా శ్రీనివాసరావు నీళ్లు చల్లారు. హాలుకు సరిపడా జనం రాలేదని, వర్షం పడుతున్నందున రాలేనని సాకులు చెప్పి... వచ్చిన వారికి భోజనాలు పెట్టి పంపేయండని హుకుం జారీ చేశారు. దీంతో కూటమి నాయకులు మనకు తగిన విధంగా శాస్తి జరిగిందని తలో విధంగా ప్రచారం చేస్తున్నారు. గంటా రాని పక్షంలో ఆయన కుమారుడు రవితేజ అయినా వచ్చేవాడని... అతను కూడా రాకపోవడంతో నాయకులు, కార్యకర్తలు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. రూ.3 లక్షలు ఖర్చయినట్టు పెట్టుబడి పెట్టిన నాయకులు ఖర్చులు రాసుకుని మథన పడుతున్నారు. ఈ కార్యక్రమానికి మధురవాడ, ఆనందపురం, పద్మనాభం, జీవీఎంసీ నుంచి వచ్చిన కూటమి నాయకులు ఇది మనకు మామూలేనంటూ జోకులు వేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులే వర్గపోరుతో ఈ కార్యక్రమాన్ని ఫ్లాప్ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇదే పెద్దిపాలెం గ్రామంలో మధ్యాహ్నం ఒకరి ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వచ్చి... పార్టీ కార్యక్రమానికి రాకపోవడంతో పలు అనుమానాలకు కలుగుతున్నాయని నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో ఎన్నో ప్రయోజనాలు


మధురవాడలో సోలార్ రూఫ్‌టాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఈ పోలాకి శ్రీనివాసరావు

మధురవాడ : విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు సోలార్ రూఫ్‌టాప్‌లు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని విద్యుత్ శాఖ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం సాయంత్రం జోన్ – 3 కార్యాలయంలో ఏఈలు, డీఈలు, ఇతర అధికారులు మీటర్ రీడర్స్‌తో నిర్వహించిన అవగాహన సదస్సులో పీఎం సోలార్ రూఫ్‌టాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా రాయితీలో విద్యుత్ వినియోగదారుల ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా బిల్లులు గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరికైనా సందేహాలుంటే నేరుగా తమను సంప్రదించవచ్చని చెప్పారు. జోన్ పరిధిలోని భీమిలి, గోపాలపట్నం, ఆనందపురం, మధురవాడ, పెందుర్తి సబ్ డివిజన్ డీఈలు, వీటి పరిధిలోని 16 మంది ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ : మధురవాడ జోన్ – 2 పరిధి 6, 7, 8 వార్డుల్లోని ప్రాంతాలకు బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎస్ రవి చెప్పారు. ఆనందపురం మండలం బోని గ్రామం సమీపంలోని గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద 700 ఎంఎం డీఐ పైప్‌లైన్‌కు లీకులు ఏర్పడినందున వాటికి మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. జీవీఎంసీ 6వ వార్డులోని ఆర్‌హెచ్ కాలనీ, అశోక్‌నగర్, పీఎం పాలెం, తులసినగర్, పీఎం పాలెం హౌసింగ్ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, రిక్షా కాలనీ, వైభవ్‌నగర్, ప్రశాంతినగర్, వళినగర్, 7వ వార్డులోని మిథిలాపురి ఉడా కాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ, దుర్గానగర్ 1 అండ్ 2 ప్రాంతాలు, 8వ వార్డులోని పాత మధురవాడ, షిప్‌యార్డ్ లే అవుట్, క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని, ప్రజలంతా గమనించి సహకరించాలని కోరారు.

తెరుచుకున్న కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డు


ఇదే కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డు

మధురవాడ : ఎట్టకేలకు జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ హైవే – కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డు తెరుచుకుంది. స్థల యజమాని – జీవీఎంసీ అధికారుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా నవోదయ వద్ద గల రోడ్డును సంబంధిత స్థల యజమాని కోర్టు ఆర్డరు తెచ్చి రెండు రోజుల కిందట మూసేశారు. దీంతో ఆర్‌టీసీ బస్సులు, ఆటోలతోపాటు అత్యవసర రాకపోకలు కూడా నిలిచిపోయాయి. దీంతో కే1, కే2 జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలు, ఇతర ప్రాంతాల వాసులు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఒకానొక దశలో జోనల్ కమిషనర్ చాంబర్ ముందు బైఠాయించి సమస్య పరిష్కారమయ్యేంత వరకు కదలమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈఈ శాంతిరాజు, సూపరింటెండెంట్ అప్పలరాజు, తదితరులు ఆందోళనకారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులు స్థల యజమానితో మాట్లాడి మంగళవారం సమస్య పరిష్కరించారు. రోడ్డు తెరుచుకోవడంతో ఆయా కాలనీల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూ ఆక్రమణలపై తహసీల్దార్ పరిశీలన


కణమాంలో విచారణ జరుపుతున్న తహసీల్దార్ శ్యాంప్రసాద్, రెవెన్యూ అధికారులు

తగరపువలస : ఆనందపురం మండలం కణమాం పంచాయతీలో భూ ఆక్రమణలపై అందిన ఫిర్యాదులపై తహసీల్దార్ శ్యాంప్రసాద్ మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 72/3లో జరిగిన ఆక్రమణలపై ఇటీవల స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. పంచాయతీలో రైతు భరోసా కేంద్రం పక్కనే ఉన్న స్థలాన్ని పరిశీలించిన తర్వాత ఆర్‌ఐ మణికంఠ, వీఆర్వో నవీన్‌ను తహసీల్దార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుపై నిజానిజాలను విచారించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు.

బదిలీ అధికారులకు సత్కారం


ఆర్‌ఎస్ఐలను సత్కరిస్తున్న పద్మనాభరాజు

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డు పరిధి బక్కన్నపాలెం ఏపీఎస్‌పీఎఫ్ పోలీస్ శిక్షణా కేంద్రంలో పనిచేస్తున్న నలుగురు ఆర్‌ఎస్‌ఐలు బదిలీ కాగా వారిని 16వ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వాహనలో చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు ఇళయసాగర్, పి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.